# జాగరణ

ఆ రోజు శివరాత్రి. ఊరంతా కోలాహలంగా ఉంది. శివలింగోద్భవ వేళ అని పాలాభిషేకాలు చేస్తున్నారు. కొందరు భక్తులు తన్మయత్వంతో 'ఓం నమశ్శివాయ' అంటూ జపిస్తున్నారు. మైకుల్లో శివస్తోత్రాలు వినబడుతున్నాయి. అప్పటికే సాయంకాలమయింది. ఊరిడిమంది దేవాలయ ప్రాంగణాలలోనే ఉన్నారు.

"నాన్నా! నాన్నా! ఎక్కడికి వెలుతున్నావు?" చెప్పులు తొడుక్కుని బయటకు వెళ్ళబోతున్న శంకర్‌ని 6 ఏళ్ళ పాప కాళ్ళు పట్టి ఆపి అడిగింది. "లేదమ్మా! ఇప్పుడే వచ్చేస్తా!" కూతురు రెండు చేతులు పట్టుకుని విడిపించబోయాడు.

"నాన్నా! నాన్నా! ఈ రోజు నా పుట్టిన రోజు. ఇప్పుడు కేక్ కొయ్యాలి! నా ఫ్రెండ్సు వస్తారు" అంది అతని రెండు కాళ్ళు మరింత గట్టిగా రెండు చేతులతో పట్టుకుని.

"ఇప్పుడే వచ్చేస్తానమ్మా! నా చిట్టితల్లివి కదూ! నా బంగారు తల్లివి కదూ! నన్ను వెళ్ళనీయమ్మా!" కూతురు దివ్య గడ్డం పట్టుకు బతిమాలాడు.

"నువ్వు వెడితే మళ్ళీరావు నేను ఎల్లనివ్వను" దివ్య ముద్దు ముద్దు మాటలతో బతిమాలుతూ మారాం చేసింది.

అంతలో భార్య ఈశ్వరి అక్కడికి వచ్చింది.

"అదేమిటండీ! దాని పుట్టిన రోజు కేక్ కొయ్యాలి! మీరెక్కడికి వెడుతున్నారు?" ఈశ్వరి అడిగింది.

"ఇక్కడికే! ఇప్పుడే వచ్చేస్తాగా!" అన్నాడు శంకర్.

"మీరు ఎక్కడికి వెడతారో నాకు తెలుసండి, ఉద్యోగం చేసుకుని పొట్ట పోషించుకునే వాళ్ళం మనకెందుకండి రాజకీయాలు!"

"వెర్రిదానా! కార్యకర్తలకు డబ్బు బాగా దొరుకుతుంది. పైగా పెద్దల పరిచయాలతో పనులన్నీ చేయించుకోవచ్చు!"

"ఏం పరిచయాలో ఏం పనులు చేయించుకుంటావో, గొడవలన్నీ మనకెందుకండీ? ఆ మీటింగుకు వెళ్ళక హాయిగా ఇంట్లో ఉండండీ! మీరు లేకపోతే అది పేచీ పెడుతుందండీ!" ఆమె కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. గొంతు బొంగురు పోయింది.

"వెర్రిదానా! ఎందుకు బాధపడుతున్నావు? ఈ రోజుల్లో ఉద్యోగం చేస్తే ఏం వస్తుందే? చాలీ చాలని జీతాలు, ఈ సెల్‌ఫోను, ఈ మోటారు సైకిలు ఎక్కడి వనుకుంటున్నావు? పెద్దల పరిచయాల వల్లే! మీటింగు టైం అవుతోంది. నేనక్కడ ఉండాలి. గంటలో వచ్చేస్తా అంటు భార్యకు నచ్చచెప్పాడు.

"నువ్వే కావాలి నాన్నా! నువ్వు ఎళితే రావు! నే వదలను!" దివ్య మరింత పేచీ పెట్టింది.

ఇంతలో "శంకర్ వస్తున్నావా?" బయట నుంచి విష్ణు పిలుపు వినబడింది. వాచీ చూసుకుని శంకర్ కంగారు పడ్డాడు.

"వెళ్ళనియ్యమ్మా! నాన్నకి బయటి పనులే ముఖ్యం" అంది ఈశ్వరి కూతుర్ని దగ్గరకు తీసుకుంటూ.

అంతలో కూతురు పద్మ "నాన్నా! నా బర్త్‌డేకి నువ్వుండవా? ఎక్కడికి వెళ్ళకు నాన్నా!" తండ్రి కాళ్ళను చుట్టేసుకుంది మరింత గట్టిగా.

"నన్ను వదులు తల్లీ! నేను ఇప్పుడే వచ్చేస్తాగా! వచ్చేటప్పుడు నీకు లడ్డూలు, చాక్‌లెట్లు పట్టుకొస్తాగా!"

అంతలో "శంకర్ వస్తున్నావా?" బయటినుంచి విష్ణు పిలుపు వినబడింది.

వాచీ చూసుకున్న శంకర్ మరింత కంగారు పడ్డాడు.

"వెళ్ళనియ్యమ్మా! నాన్నని నువ్వు, నేను కంటె వాళ్ళే ఎక్కువ" అని తల్లి అనగానే దివ్య ఏడుస్తూ తండ్రి రెండు కాళ్ళూ వదిలి తల్లిని వాటేసుకుంది.

"ఏడవకమ్మా! నా బంగారు తల్లివి కదూ! ఏడవకు?" అంటూ కూతురు గడ్డం పట్టుకుని బతిమాలాడు.

"పో! నీ మాట నమ్మా!" అంటు దివ్య తండ్రి చేతులు తోసేసింది.

"అంత మొండి పట్టుదల పనికిరాదమ్మా! నా తల్లివి కదూ! ఇప్పుడే వచ్చేస్తాగా!" అంటు శంకర్ బయటకు వెళ్ళి మోటార్ సైకిల్ స్టార్టు చేసి విష్ణుతో కలిసి వెళ్ళిపోయాడు.

ఈశ్వరి భర్తలో వస్తున్న మార్పుకి చాలా బాధపడింది. ఎందుకో అతను రోజు రోజుకి మారిపోతున్నాడు. ఇల్లు, వాకిలి, తను, కూతురు కంటె అతన్ని బయట రాజకీయ సభలే ఆకర్షిస్తున్నాయి. పూర్తిగా అందులో మునిగిపోతున్నాడు. ఏం ప్రమాదం ముంచుకొస్తుందో నని ఆమె భయపడుతూనే ఉంది. కాని ఎంత ప్రయత్నించినా అతన్ని మాత్రం ఆపలేకపోతోంది.

దివ్య తండ్రికోసం ఏడ్చి, ఏడ్చి నిద్రపోయింది. సాయం సంధ్య దాటి సూర్యుడు అస్తమించగానె అంతా చీకటి అలముకుంది. శంకర్ ఇంటికి రాలేదు.

ఊరంతా మరింత సందడిగా ఉంది. ఎక్కడ చూసినా శివభక్తుల పాటలు, మంత్రాలు, పూజలు వినబడుతున్నాయి.

చిన్నారి పద్మ కళ్ళు నులుము కుంటూ లేస్తూనె "నాన్న రాలేదా?" అంటూ అడిగింది.

"ఇంక వస్తూ ఉంటారమ్మా! రా! రా! ఇదిగో నీ ఫ్రెండ్సు వచ్చేసారు! కేక్ కట్ చెయ్యాలి!" రా! రా! అంటూ దివ్య చేత ఎలాగో అలాగ కేక్ కట్ చేయించింది ఈశ్వరి. ఆ పిల్లల్ని చూడగానె దివ్య తండ్రి సంగతి మరిచిపోయింది. అందరు కలిసి "హ్యాపీబర్త్ డే దివ్యా!" అంటూ పాటలు పాడారు. అందరూ కేక్ కట్‌చేసి ఆడి, పాడి అలసిపోయి సంతోషంగా ఫలహారాలు తిని తిరిగి ఇళ్ళకు బయలు దేరి వెళ్ళిపోయారు.

"అమ్మా! చూసావా? నాన్న రాలేదు?" దివ్య మళ్ళీ మారాం చేయడం ప్రారంభించింది.

"వచ్చేస్తారమ్మా! ఇంక నాన్న వచ్చేస్తారు?" అంటూ ఆ తల్లి కూతుర్ని ఓదారుస్తూనే ఉంది! అంతకంటె ఆ తల్లి ఏం చెయ్యలేక పోయింది.

"అమ్మా! నాన్న ఎప్పుడొస్తారు? ఈ కొత్త గౌను నాన్న చూడాలమ్మా!" అంటూ దివ్య తిరిగి ఏడుపు ప్రారంభించింది.

"నాన్న తప్పకుండా నీ గౌను చూస్తారమ్మా! నాన్నగారు నీకు చాక్‌లెట్లు, లడ్డూలు తెస్తానన్నారుగా! అవన్నీ తిన్నాకే గౌను మార్చుకుందువుగాని! రామ్మా! రా!" అంటూ కూతుర్ని వొళ్ళో కూర్చోపెట్టుకుని తెనాలి రామకృష్ణ కథలు చెప్పడం ప్రారంభించింది. దివ్య మెల్లిగా నిద్రలోకి జారింది.

ఇల్లంతా బిక్కు బిక్కుమంటోంది. పక్క గుడిలో నుంచి పార్వతీ పరమేశ్వరుల వివాహ ఘట్టం హరికథ వినబడుతోంది. భక్తులు పారవశ్యంతో పార్వతీ పరమేశ్వరులకు

జై అంటున్న నినాదాలు వినబడుతున్నాయి. అప్పటికే అర్థరాత్రి దాటింది. ఈశ్వరి కంటికి కునుకు లేదు. అనుకోని విదంగా జాగరణ చేస్తూనే ఉంది.

"ఎప్పుడూ ఇంత ఆలస్యం కాలేదు. ఏం జరిగిందో ఏమిటో?" ఈశ్వరి భయంతో వణికింది.

అంతలో తలుపు మీద టక టక చప్పుడయింది. దివ్యను వడిలో నుంచి మెల్లిగా లేవదీసి మంచంమీద పడుకోపెట్టి కిటికీ తెరచి చూసింది.

"వచ్చింది శంకర్ కాదు. శంకర్ స్నేహితుడు గోవింద్ గుమ్మం ముందు నిలబడి ఉన్నాడు.

"శంకర్ రాలేదా?" కంగారుగా తలుపుతీసి అడిగింది ఈశ్వరి.

"వదినమ్మా! అనవసరంగా కంగారు పడకు. ఆ మీటింగులో కాస్త గొడవలయ్యాయి. పోలీసులు వచ్చి శంకర్‌నే కాదు అందరినీ అరెస్టు చేసి తీసుకెళ్ళారు. పొద్దుటే విడుదల చేస్తారు! ఏం భయంలేదు తలుపులేసుకు పడుకో!" గోవింద్ ఈశ్వరి మరేం అడగడానికి అవకాశం ఇవ్వకుండానే తిరిగి అక్కడి నుంచి వెనుతిరిగాడు. ఈశ్వరి ప్రశ్నలు నోటిలోనే ఉండిపోయాయి. భయంతో వణుకుతూ లేని ధైర్యం తెచ్చుకుని తిరిగి తలుపులు మూసి గడియ పెట్టి దివ్య పక్కన కూర్చుని వెక్కి వెక్కి ఏడ్చింది.

"శంకర్ ఏ చావు దెబ్బలు తిన్నాడో, పోలీసుల చేతపడిన వారిని లాఠీల రుచి చూపించకుండా వదలరు? తిండి లేదు. ఎప్పుడో ఇంటినుంచి బయలుదేరే ముందు ఓ కప్పు టీ తాగాడు. ఆకలి బాధతో, ఏం చేస్తున్నాడో?" అనుకుంటూ మరింత బాధపడింది.

దివ్యకు మెళకువ వస్తే తండ్రి కోసం పేచీ పెడుతుందని మంచం దిగి వచ్చి సోఫాలో కూర్చుండిపోయింది. అలా ఎంత సేపు కూర్చుందో ఆమెకే తెలియదు.

ఇంకా వెలుగురాలేదు. కాలింగ్ బెల్ మోగింది. ఈశ్వరి ఉలిక్కిపడి కళ్ళు తెరచింది.

"అక్కా! అక్కా! తలుపు తియ్యి!" తమ్ముడు గొంతు గుర్తుపట్టిన ఈశ్వరి లేచి వెళ్ళి తలుపు తీసింది.

"అక్కా! అక్కా! ఎంత పని జరిగిందో చూసావా? ఈ రాజకీయంలో మనవాళ్ళు బలయ్యారు అక్కా! నిజంగానె మోసపోయారు" అన్నాడు గుక్క తిప్పుకోకుండా.

"బాగా జరిగిందిరా! అలా జరగవలసిందే! ఇల్లు, వాకిలి, భార్యా, పిల్లలు అనే బాధ్యత లేకుండా ఆఫీసు పనిమీద ధ్యాసలేకుండా, కార్యకర్తలమని, అంతా తమ మీదే ఉందని విర్రవీగితే ఏమవుతుందిరా? ఇలాగే జరుగుతుందిరా!" అంది కోపంగా. అసలే కంటికి కునుకు లేక ఎర్రబడిన ఆమెకళ్ళు మరింత ఎర్రబడ్డాయి.

అలా అనకు అక్కా! ఆ రాజకీయ మీటింగ్ ఏర్పాటు చేసింది మన వాళ్ళే! షామ్యాన వేసి, బ్యానర్స్‌కట్టి, స్టేజి అలంకరించారు. నాయకులందరు వచ్చారు. జనం బాగానే వచ్చారు. బావశంకర్, విష్ణు, గోపాల్, రాము నాలుగు వైపులా గస్తీ తిరుగుతున్నారు. మీటింగ్ ప్రారంభమయింది. ఒక నాయకుడు మాట్లాడుతూ గొంతు పెంచి మరీ పార్టీ నాయకుణ్ణి విమర్శించాడు. అంతే జనంలో నుంచి ఎవరో చెప్పులు విసిరారు. అంతే వీళ్ళూ విసిరారు. కొందరు ముందే వచ్చి సిద్ధం చేసుకున్న రాళ్ళు విసిరారు. అంతే కోడి గుడ్లు, టమోటాలు, రాళ్ళు, చెప్పులు ఒకరి మీద ఒకరే కాదు స్టేజి మీదికి విసిరారు. జనం హాహాకారాలు ప్రారంభించారు. అటు ఇటు పరుగులెత్తారు. ఎవరో ఫోను చేసినట్లున్నారు. పోలీసులు రంగంలోకి దిగారు. నాయకుల్ని జాగ్రత్తగా కార్లు ఎక్కించి పంపించి ముందు వెనక చూడకుండా అందిన వారిని పట్టుకుని చావకొట్టారు. పైగా పట్టుకుని జీపు లెక్కించి స్టేషన్‌కి తీసుకెళ్ళి కట కటాల్లో పడేసి తాళం పెట్టారక్కా!

"అదేమిట్రా! ఇంతకీ మీ బావ దెబ్బలు తిన్నాడా?" కోపం తగ్గి ఆతురతగా అడిగింది ఈశ్వరి.

"బావకి బాగా దెబ్బలు తగిలాయి. అంతే కాదక్కా బావ మోటారు సైకిలు...." ఇంక చెప్పలేకపోయాడు చందూ!

"చెప్పరా! ఏమయింది? మోటారు సైకిలు కూడా పోలీసులు పట్టుకుపోయారా?" ఆశ్చర్యంగా అడిగింది ఈశ్వరి.

"కాదక్కా! ఎవరో తగలపెట్టేసారు" తలవంచుకునే సమాధానమిచ్చాడు చందు.

"అంతపని జరిగిందా?" ఇంక ఈశ్వరికి నోట మాటరాలేదు.

"అవునక్కా! కొంత మంది బావని, మిలిగినవారిని విడిపించి తీసుకురావడానికి వెడుతున్నారక్కా! నేనూ వెడుతున్నా"

ఈశ్వరి పిలుస్తున్నా వినిపించుకోకుండా చందూ తలుపులు దగ్గరగా పెట్టి ఒక్క పరుగులో పారిపోయాడు.

తూర్పు వాకిలి తెరచుకుని సూర్యుడు ఉదయిస్తున్నాడు. చీకటిని తరిమివేస్తూ వెలుగు కిరణాలు హృదయాలలోని అజ్ఞానాంధకారాన్ని పోగొట్టి విజ్ఞానపు వెలుగులు విరజిమ్ముతున్నట్లుగా లోకమంతా వ్యాపిస్తున్నాయి. శివభక్తుల కోలాహలం ఆగి లోకమంతా ప్రశాంతంగా ఉంది.

శంకర్ చిరిగిన బట్టలతో, వొంటినిండా దెబ్బలతో దిగంబరమూర్తిలా ఇల్లు చేరాడు.

"ఇదేమిటండీ!" అంటూ తెల్లని బట్టలతో మోటారు సైకిలు మీద ఠీవిగా వెళ్ళిన భర్త అలా తిరిగివస్తే ఆమె చూడలేక భర్తను పట్టుకుని బావురుమంది.

"ముందు అతన్ని లోపలికి తీసుకెళ్ళి కాస్త కాఫీ తాగించి ఆ దెబ్బలకి మందు రాయవమ్మా!" అన్నారు కూడా వచ్చినవారు.

"అతన్ని మెల్లిగా నడిపించుకుని తీసుకెళ్ళి కుర్చీలో కూర్చోపెట్టింది ఈశ్వరి.

ముఖం కడుక్కోకుండానే నీరసంగా ఉన్న శంకర్ కాఫీ తాగాడు.

స్నానం చేసివచ్చి బట్టలు మార్చుకున్న శంకర్ దెబ్బలకు మందు రాయడం మొదలు పెట్టింది ఈశ్వరి.

"చూసావా ఈశ్వరీ! ఎంత పని జరిగిందో! సెల్ ఫోనులో ఎన్నిసార్లు ఆ నాయకులకు ఫోను చేసినా ఎవరూ ఉలకలేదు, పలకలేదు. పైగా పోలీసులు నా చేతిలో నుంచి ఆ ఫోనే లాగేసుకున్నారు. ప్రత్యర్థులు నా మోటారు సైకిలు తగలపెట్టారు!" సామాన్యుడు, సామాన్యుడుగానే బతకాలి?" అన్నాడు బాధగా.

"చదువుకుని ఉద్యోగం చేసి న్యాయంగా, కష్టంచేసుకుని బతికే వాళ్ళకి ఈ రాజకీయాలు పనికిరావు. వాళ్ళ రాజకీయం మనకి అర్థం కాదు కూడా! ఇన్నాళ్ళు వాళ్ళ మాయలో పడి మోసపోయాను. చివరకు దగా పడ్డాను"శంకర్ తన మనసులోని బాధను భార్యకు చెప్పుకున్నాడు. బాధపడ్డాడు. చెమర్చిన కళ్ళు చేత్తో తుడుచుకున్నాడు.

అతని మనసంతా కడిగేసినట్లయింది. మబ్బుల్లేని ఆకాశంలా, గందరగోళాలు లేని అతని మనస్సు ప్రశాంతంగా మారింది.

ఈశ్వరి భర్తలో కలిగిన పశ్చాత్తాపానికి కరిగిపోయింది. "పోనీలేండి జరిగిందేదో జరిగింది. సెల్‌ఫోను, మోటారు సైకిలు ఎలా వచ్చాయో అలాగే పోయాయి. మన రెక్కల కష్టంతో తిరిగి మనం కొనుక్కుందాం! నేనూ ఉద్యోగం వెతుక్కుంటా! పిల్లా పెద్దదయింది కదా! మీ ఉద్యోగం చేజార లేదుగా" అంది నవ్వుతూ!

అది జరగలేదులే? రాత్రంతా వొంటిమీది దెబ్బల బాధతో, మనసుకు తగిలిన గాయపు బాధతో, దోమలదాడితో కంటికి కునుకు రాక అక్కడ జాగరణ చేసా" అన్నాడు నవ్వుతూ.

"ఇదే అనుకోని శివరాత్రి జాగరణ కాబోలు" అనుకుంది ఈశ్వరి.

"మీ మీది బెంగతో నేనిక్కడ జాగరణ చేసా! సరిపడింది లెండి!" అంది ప్రశాంతమైన మనస్సుతో ఈశ్వరి.

అప్పుడే లేచిన దివ్య "నాన్నా వచ్చేసావా? నా కొత్తగౌను చూసావా?" అంటూ తండ్రి వొడిలో వాలింది.

"నా బంగారు తల్లీ లేచావా? అబ్బో నీ గౌను ఎంత బాగుందో! ఇంకెప్పుడు నిన్ను వదలి వెళ్ళనుగా" అంటు కూతుర్ని ఆప్యాయంగా వొళ్ళోకి తీసుకున్నాడు.

*నేటి నిజం దినపత్రిక*

*శివరాత్రి ప్రత్యేక అనుబంధం 2006.*